క్లుప్తంగా

సాగునీటి విడుదలపై హర్షం



అల్వాలలో కూడవెల్లి జలాలతో జలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మిరుదొడ్డి(దుబ్బాక): కూడవెల్లి వాగులోకి మల్లన్న సాగర్ సాగునీటిని విడుదల చేసినందుకు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మద్దెల రాజేష్ అన్నారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, కొండా సురేఖ, దుబ్బాక కాంగ్రెస్ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. అలాగే అల్వాల చెక్‌డ్యాంపై నుంచి పొంగిపొర్లుతున్న నీటితో ఆ ప్రాంత రైతులు సీఎంతోపాటు రాష్ట్ర మంత్రుల ఫ్లెక్సీలకు జలాభిషేకాలు చేశారు. ఆయా కార్యక్రమాలల్లో మాజీ సర్పంచ్ ఎనగంటి కిష్టయ్య, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు హర్షద్, నాయకులు తదితరులు పాల్గొన్నారు,

పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్

సిద్దిపేటకమాన్: తెలంగాణ మోడల్ స్కూల్ ప్రవేశాలకు నిర్వహించే ఎంట్రన్స్ పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని సిద్దిపేట సీపీ అనురాధ శుక్రవారం తెలిపారు. 6 నుంచి 10వ తరగతి ప్రవేశ పరీక్ష కోసం జిల్లాలో 15 కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఈనెల 7వ తేదీన జరగనున్న పరీక్షా కేంద్రాల వద్ద ఉదయం 8 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలీసు నిబంధనలు అమలులో ఉంటాయన్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని జిరాక్స్ సెంటర్స్‌ను మూసివేయాలని ఆదేశించారు. కేంద్రం నుంచి 500 మీటర్ల పరిధిలో ఐదుగురు అంతకంటే ఎక్కువ మంది ఉండకూడదన్నారు.

షీటీమ్స్‌తో మహిళలకు రక్షణ

సిద్దిపేట సీపీ అనురాధ

సిద్దిపేటకమాన్: జిల్లాలో ఏర్పాటు చేసిన షీ టీమ్స్ ద్వారా మహిళలకు రక్షణ, భద్రత కల్పిస్తున్నామని సిద్దిపేట సీపీ అనురాధ అన్నారు. శుక్రవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ షీటీమ్స్, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్స్ అధికారులు మార్చిలో పాఠశాలలు, కళాశాలల్లో మహిళల రక్షణ, చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. షీటీమ్స్ అధికారులు 46 మంది ఈవ్ టీజర్లను పట్టుకొని కేసులు నమోదు చేశారన్నారు. జిల్లాలో సిద్దిపేట, గజ్వేల్, హుస్నాబాద్ డివిజన్‌ల వారిగా షీటీమ్స్ పనిచేస్తున్నాయని తెలిపారు. మహిళా పోలీసు స్టేషన్, స్నేహిత మహిళ సపోర్టు సెంటర్, భరోసా సెంటర్‌కు వచ్చే వారికి కౌన్సెలింగ్ నిర్వహించడం, ఉపాధి లేని 36 మంది మహిళలకు ఆంధ్రాబ్యాంక్ సహకారంతో టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్‌తో పాటు పలు అంశాలపై శిక్షణ ఇస్తున్నారన్నారు. ఎవరైన వేధిస్తే మహిళలు వెంటనే డయల్ 100 లేదా, షీటీమ్ వాట్సప్ 87126 67434, పోలీసు కంట్రోల్ రూం 8712667100 నంబర్లకు సమాచారం అందించాలన్నారు.

జల దానం చేయండి



జలదానం కార్యక్రమంలో పాల్గొన్న మహిళలు

హుస్నాబాద్‌రూరల్: ప్రస్తుతం ఎండల తీవ్రత పెరుగుతోందని బాటసారులకు ఆయా గ్రామాల ప్రజలు జల దానము చేయాలని బాల వికాస ప్రతినిధి జ్యోతి విజ్ఞప్తి చేశారు. శుక్రవారం తోటపల్లి గ్రామంలో బాల వికాస ఆధ్వర్యంలో జల దానం కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో తాగు నీటిని పంపిణీ చేస్తున్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బంక చందు, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నిందితులకు జ్యుడీషియల్ రిమాండ్



నిందితులను పట్టుకున్న పోలీసులు

కొండపాక(గజ్వేల్): హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులకు జడ్జి జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. కొండపాకలో వడ్డెర కులానికి చెందిన రెండు కుటుంబాల మధ్య ఏడాది కాలంగా పాత కక్షలు ఉన్నాయి. గురువారం రేపాక చందుపై విచక్షణా రహితంగా కత్తులతో దాడి చేసి నిందితులు పరారైన విషయం పాఠకులకు తెలిసిందే. పరారైన నిందితులు రేపాక అశోక్, రేపాక నవీన్, రేపాక సంతోష్‌లను పట్టుకొని మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరచగా జడ్జి వారికి జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

రేషన్ బియ్యానికి రెక్కలు

- లబ్ధిదారుల నుంచి బియ్యం కొనుగోలు
- గ్రామాల్లో పోటీపడికొంటున్న వ్యాపారులు
- రహస్య ప్రదేశాల్లో నిల్వ
- పొరుగు రాష్ట్రాలకు తరలింపు

పేదల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రజాపంపిణీ దుకాణాల ద్వారా నిత్యావసరాలు, బియ్యం పంపిణీ చేస్తోంది. అయితే కొంత మంది లబ్ధిదారులు డబ్బుకు ఆశపడి వారికి పంపిణీ చేసిన బియ్యాన్ని అమ్ముకుంటున్నారు. వ్యాపారులు ప్రతీ గ్రామం తిరిగి బియ్యం సేకరించి రహస్య ప్రదేశంలో నిల్వ చేస్తున్నారు. ఇక డీలర్లు కూడా రేషన్ లబ్ధిదారుల డబ్బు బలహీనతను ఆసరా చేసుకొని వారికి పంపిణీ చేసే బియ్యాన్ని తామే కొనుగోలు చేసి దళారుల ద్వారా ఒప్పందం చేసుకొని మిల్లులకు తరలిస్తున్నారు. అధికారులు రేషన్ బియ్యం బ్లాక్ మార్కెట్‌పై చర్యలు తీసుకోవాలని సామాజిక వేత్తలు కోరుతున్నారు.



ఇబ్రహీంనగర్‌లో ఆటోలో తరలిస్తున్న రేషన్ బియ్యం (ఫైల్)

చిన్నకోడూరు(సిద్దిపేట): ప్రజాపంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. ప్రభుత్వం నిరుపేదలకు పంపిణీ చేసే రేషన్ బియ్యం పక్కదారిపడుతోంది. ప్రతీనెలా రేషన్ తీసుకుంటున్న లబ్ధిదారుల్లో కొందరు ఆ బియ్యాన్ని వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. ఇక గ్రామాల్లో వ్యాపారులు ఇంటింటికీ తిరుగుతూ కిలో రూ.15 నుంచి 20 చొప్పున కొనుగోలు చేస్తున్నారు. అలా కొనుగోలు చేసిన బియ్యాన్ని గ్రామాల శివారులో రహస్యంగా డంప్ చేస్తున్నారు. ఇలా సేకరించిన బియ్యాన్ని ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. తరచూ రేషన్ బియ్యం తరలిస్తున్న వాహనాలను అధికారులు పట్టుకున్నా నామమాత్రపు చర్యలతో సరిపెడుతున్నారు. దీంతో ఈ దందా మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతుంది.

అక్రమ రవాణాకు సూత్రధారులు

రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తూ పట్టుబడుతున్నట్లు ప్రతీరోజూ అన్ని మండలాల్లో జరుగుతున్న విషయం తెలిసిందే. రేషన్ దుకాణాల నుంచి అక్రమంగా బియ్యాన్ని కొంత మంది డీలర్లు కుమ్మక్కై ఈ వ్యవహారాన్ని నడిపిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వినియోగదారుల నుంచి డీలర్లే స్వయంగా కొనుగోలు చేసి ఈ బియ్యాన్ని దళారులతో ఒప్పందం మేరకు రైస్‌మిల్లులకు సరఫరా చేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

తనిఖీలు లేవు

గ్రామీణ ప్రజలకు అందించే రేషన్ బియ్యాన్ని డీలర్లు సక్రమంగా అందజేస్తున్నారా? లేదా? అనే దానిపై రెవెన్యూ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలి. కానీ, అలాంటిది ఏమీ పట్టించుకోకుండా ఆ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో గ్రామాల్లో రేషన్ బియ్యం పక్కదారి పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. అప్పుడప్పుడు టాస్క్‌ఫోర్స్ పట్టుకున్నా రవాణా చేసేవారిపై కేసులు నమోదు చేసి, పట్టుకున్న బియ్యాన్ని ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులకు అప్పగించి సరిపెడుతున్నారు.

> **అక్రమ రవాణాను అడ్డుకుంటాం**
>
> రేషన్ షాపులను నిత్యం తనిఖీ చేపడతాం. రేషన్ బియ్యం అక్రమంగా తరలించకుండా అడ్డుకుంటాం. అక్రమంగా తరలిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. డీలర్ల పర్యవేక్షణ ఉండేలా, ప్రజలకు రేషన్ బియ్యం అందేలా చూస్తాం.
>
> – జయలక్ష్మి, తహసీల్దార్

కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు



పంతులుతండాలో ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న వైద్యసిబ్బంది

- పనిప్రదేశంలో సేదదీరేందుకు షెడ్‌నెట్
- ఎంపీడీఓ జయరాం

సాక్షి ఎఫెక్ట్..

అక్కన్నపేట(హుస్నాబాద్): 'ఎండ దరువు...నీడ కరువు' శీర్షికన సాక్షిలో ఈనెల 3వ తేదీన ప్రచురితమైన కథనానికి ఎంపీడీఓ భానోతు జయరాం స్పందించారు. గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధి హామీ పనుల ప్రదేశాల్లో కూలీలకు అన్ని వసతులు కల్పించాలని పంచాయతీ కార్యదర్శులకు ఆదేశించామన్నారు. కూలీలు సేదదీరేందుకు పని ప్రదేశంలో టెంట్ల స్థానంలో షెడ్‌నెట్‌లను ఏర్పాటు చేశారన్నారు. అదేవిధంగా తాగునీరు సరఫరా కూడా చేస్తున్నామన్నారు. కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, వాటిపై అవగాహన కల్పించాలని సంబంధిత వైద్యాధికారులతో మాట్లాడినట్లు చెప్పారు. శుక్రవారం వైద్యసిబ్బంది మండలంలోని పంతులుతండా గ్రామంలో ఉపాధి హామీ కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సతీష్, వైద్య సిబ్బంది బాబురావు, ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

తుక్కుగూడ సభను విజయవంతం చేయండి

నియోజకవర్గ కాంగ్రెస్ ఎన్నికల కో ఆర్డినేటర్ శ్రీనివాస్ గౌడ్

హుస్నాబాద్: తుక్కుగూడ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని హుస్నాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎన్నికల కో ఆర్డినేటర్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ శుక్రవారం కార్యకర్తలకు పిలుపునిచ్చారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శనివారం జరిగే భారీ బహిరంగ సభకు ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు హాజరవుతున్నారన్నారు. సమావేశంలో టీ పీసీసీ సభ్యుడు కేడం లింగమూర్తి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, హుస్నాబాద్, అక్కన్నపేట, కోహెడ, చిగురుమామిడి మండలాల పార్టీ అధ్యక్షులు బంక చందు, జంగపల్లి అయిలయ్య, మంద ధర్మయ్య, కంది తిరుపతి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మడప యాదవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్ గౌడ్

తుక్కుగూడ సభకు తరలిరావాలి

బెజ్జంకి(సిద్దిపేట): రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో శనివారం నిర్వహించే జనజాతర బహిరంగ సభకు నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపు ఇచ్చారు. ఏఐసీసీ నాయకులు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే తదితర అగ్రనేతలు హాజరవుతున్న సభను విజయవంతం చేయాలన్నారు.

బీజేపీ గెలుపు కోసం కృషి చేద్దాం



సురేష్‌గౌడ్‌ను సన్మానిస్తున్న నాయకులు

బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ సురేష్‌గౌడ్

మద్దూరు(హుస్నాబాద్): రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి అత్యధిక సీట్లు గెలిచే విధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీజేవైఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ బొంగొని సురేష్ గౌడ్ అన్నారు. సురేష్ గౌడ్ స్వగ్రామం మండలంలోని గాగ్గిళ్లాపూర్ గ్రామంలో శుక్రవారం మండల బీజేపీ, బీజేవైఎం నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీలో కష్టపడిన ప్రతీ కార్యకర్త ఉన్నత స్థాయికి చేరుకుంటారని అందుకు ప్రధాని మోదీ నిదర్శనమన్నారు. త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ఇంటింటి ప్రచారం నిర్వహిద్దామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మోకు ఉదయ్‌రెడ్డి, పైసా బాలకృష్ణ, గుళ్ల రాజు, సాయి, రాకేష్ పటేల్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వివాహిత మృతి

కొండపాక(గజ్వేల్): కుటుంబ కలహాలు, అప్పుల బాధ భరించలేక జీవితంపై విరక్తితో ఓ వివాహిత పురుగుల మందు ఆత్మహత్యకు యత్నించింది. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. జనగామ జిల్లా ఆంక్షాపూర్ గ్రామానికి చెందిన గుండెవాడి నాగరాజు కూతురు రవళి(28)ని పదేళ్ల క్రితం మండలంలోని అంకిరెడ్డిపల్లికి చెందిన కండెపల్లి ప్రశాంత్‌తో వివాహం చేశారు. ప్రశాంత్ జులాయిగా తిరుగుతూ మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్యాభర్తలు తరుచూ గొడవపడేవారు. పెద్దలు రవళికి నచ్చజెపుతూ వచ్చారు. ప్రశాంత్ ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన రవళి మార్చి 31వ తేదీ రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కుటుంబ సభ్యులు గమనించి సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచనల మేరకు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఉపాధి కూలీలకు వడదెబ్బపై అవగాహన



వడదెబ్బపై అవగాహన కల్పిస్తున్న ఆశ కార్యకర్తలు

హుస్నాబాద్‌రూరల్: హుస్నాబాద్ మండలం పందిల్ల గ్రామంలో శుక్రవారం ఉపాధి హామీ కూలీలకు వడదెబ్బపై ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించారు. ఎండలు పెరుగుతుండటంతో కూలీలు పనులు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఎండలో పనిచేసే కూలీలు అస్వస్థతకు గురైతే వెంటనే స్థానిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి వైద్య సిబ్బంది సలహాలు తీసుకోవాలన్నారు. అనంతరం కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

ఆ భూములకు పట్టాలిప్పించాలి

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని చిలాపూర్ శివారులోగల 118, 164 సర్వే నంబర్‌లలో దళితులకిచ్చిన భూములకు పట్టాలిప్పించాలని కోరుతూ శుక్రవారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణకు వినతి పత్రం అందజేశారు. సుమారు 40 ఏళ్లుగా కాస్తులో ఉండి పాత పాస్ బుక్కులు ఉన్నప్పటికీ ధరణిలో తమ పేర్లు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

అక్కన్నపేటలో పౌర గ్రంథాలయం

అక్కన్నపేట(హుస్నాబాద్): గ్రామీణ ప్రజలకు గ్రంథాలయాలను చేరువ చేసేందుకు గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో పబ్లిక్ రీడింగ్ రూమ్‌లు ఏర్పాటు చేసింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా అక్కన్నపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 'పౌర పఠన మందిరం' ప్రారంభించారు. అయితే పాఠశాలలో సౌకర్యాలు సరిగా లేకపోవడంతో ఈ పఠన మందిరాన్ని గ్రామపంచాయతీ కార్యాలయంలోకి తరలించారు. ఈ కార్యాలయంలో ఒక గదిని కేటాయించి వసతులు కల్పించారు. ప్రస్తుతం ఈ పఠన మందిరంలో వివిధ రకాల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ప్రతీ రోజు ఉదయం 8 నుంచి 10 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 5గంటలకు పఠన మందిరం తెరించి ఉంటుందని పంచాయతీ కార్యదర్శి లక్ష్మీకాంతరావు తెలిపారు. నిరుద్యోగ యువకులు, పుస్తక పఠన ప్రియులు ఈ పఠన మందిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతున్నారు.



అక్కన్నపేట గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పౌర పఠన మందిరం

బాబు జగ్జీవన్ రామ్‌కు ఘన నివాళి

బాబు జగ్జీవన్ రామ్ గొప్ప సంఘ సంస్కర్త అని రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. శుక్రవారం బాబు జగ్జీవన్ రామ్ జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటాలు, విగ్రహాలకు పూల మాలలువేసి నివాళులర్పించారు. పట్టుదల, ఆత్మ విశ్వాసంతో జగ్జీవన్ రామ్ తన రాజకీయ జీవితాన్ని ఆదర్శప్రాయంగా కొనసాగించారన్నారు. హరిత విప్లవంలో భారత ఆహార గిడ్డంగులను ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలిచారన్నారు.



గజ్వేల్‌లో బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



దుబ్బాకలో నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నె వనిత



హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత



చేర్యాలలో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాంగ్రెస్ మండల అధ్యక్షుల నియామకం



మల్లేశం

మద్దూరు(హుస్నాబాద్): కాంగ్రెస్ పార్టీ మద్దూరు మండల అధ్యక్షుడిగా మండలంలోని గాగ్గిళ్లాపూర్ గ్రామానికి చెందిన మేక మల్లేశం, దూల్మిట్ట మండల అధ్యక్షుడిగా తోర్నాల గ్రామానికి చెందిన కోల సాయిలుగౌడ్‌ను నియమిస్తూ కాంగ్రెస్ చేరికల కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు మహేష్‌కుమార్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడారు. తమను అధ్యక్షులుగా నియమించినందుకు సంతోషంగా ఉందన్నారు. జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.



కొమ్ము రవి

చేర్యాల(సిద్దిపేట): కాంగ్రెస్ పార్టీ చేర్యాల మండల అధ్యక్షుడిగా మండల పరిధిలోని ఆకునూరు గ్రామానికి చెందిన కొమ్ము రవిని నియమిస్తున్నట్లు డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. తనపై నమ్మకంతో పార్టీ మండల అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన కొమ్మూరి ప్రతాప్‌రెడ్డికి రవి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపాడు. మండల పరిధిలో పార్టీని మరింత బలోపేతం చేస్తామన్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని అత్యధిక మెజార్టీతో గెలిపించేలా కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపాడు.

సంక్షిప్త వార్తలు

◆ నేత్రపర్వంగా శివపార్వతుల కల్యాణం

నంగునూరు(సిద్దిపేట): శివ పంచాయతన సహిత హనుమాన్ దేవాలయ ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం ఖానాపూర్‌లో శివపార్వతుల కల్యాణం నేత్రపర్వంగా నిర్వహించారు. ముందుగా ఉత్సవ విగ్రహాలను పల్లకిలో ఊరేగించారు. అనంతరం మహిళలు ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. కల్యాణాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివచ్చారు.

◆ నిందితులను అరెస్ట్ చేయాలి

ములుగు(గజ్వేల్): మండలంలోని కొత్తూరులో హోలీ పండగనాడు దళితులపై దాడిచేసిన నిందితులను వెంటనే అరెస్ట్ చేయాలని డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్ డిమాండ్ చేశారు. శుక్రవారం బాధితులు శ్రీకాంత్, ఎల్లారావు, దాస్‌లను పరామర్శించామన్నారు. హోలీ పండగ రోజు రాత్రి గ్రామంలోని కూరగాయల మార్కెట్‌లో బుర్జుకాడి యాదగిరి తదితరులు ఆధ్వర్యంలో దాడి చేశారని ఆరోపించారు. నిందితులపై అట్రాసిటీ కేసు నమోదు చేసినా వారిని అరెస్ట్ చేయకుండా నిర్లక్ష్యం వహించడం తగదన్నారు. ఈ ఘటనపై జాతీయ, రాష్ట్ర, ఎస్సీ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

◆ పెద్దమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవం

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని గుగ్గిల్లలోగల పెద్దమ్మ తల్లి ఆలయ తృతీయ వార్షికోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం మానకొండూర్ ఎమ్మెల్యే కవ్వంపెల్లి సత్యనారాయణ అమ్మవారిని దర్శించి పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు అమ్మవారి చిత్రపటాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దామోదర్, చెప్యాల శ్రీనివాస్‌గౌడ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

◆ మైనార్టీలకు అండగా కాంగ్రెస్ పార్టీ



మద్దూరు(హుస్నాబాద్): మైనార్టీలకు అండగా నిలిచే పార్టీ కాంగ్రెస్ అని జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి అన్నారు. పార్టీ మద్దూరు గ్రామశాఖ అధ్యక్షుడు షౌకత్ అలీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఇఫ్తార్ విందుకు హాజరై మాట్లాడారు. దేశ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు మేక మల్లేశం, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ జీవన్ రెడ్డి, చేర్యాల మండల అధ్యక్షుడు కొమ్ము రవి, దుల్మిట్ట మండల అధ్యక్షుడు కోలా సాయిలు, మాజీ సర్పంచ్ కాంటారెడ్డి జనార్ధన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ నీతికథల పుస్తకాల ఆవిష్కరణ సంతోషకరం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): సిద్దిపేట జిల్లా బడిపిల్లలు రాసిన నీతికథల పుస్తకాలు హైదరాబాద్‌లో ఆవిష్కరించడం సంతోషంగా ఉందని బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం శుక్రవారం అన్నారు. బడిపిల్లల సాహిత్యం బాలల వికాసానికి తోడ్పడుతుందని, కల్మషం లేని బాలలు భవిష్యత్ తరాలకు నిర్మాతలన్నారు. సిద్దిపేట జిల్లాలో బాలసాహిత్య రచనలకు కొదువలేదని, బాలసాహిత్య వికాసంలో సిద్దిపేట ముందు వరుసలో నిలుస్తుందన్నారన్నారు. 54 కథలతో రెండు పుస్తకాలుగా ప్రచురించారన్నారు.

◆ అసత్య ప్రచారాలు మానుకోవాలి

దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి శ్రీనివాస్ రెడ్డి

మిరుదొడ్డి(దుబ్బాక): ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై చేస్తున్న అసత్య ప్రచారాలను మానుకోవాలని దుబ్బాక కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మల్లన్న సాగర్ నుంచి కూడవెల్లి వాగులోకి విడుదల చేసిన సాగు నీరు శుక్రవారం అక్బర్‌పేట-భూంపల్లి మండల కేంద్రం వరకు చేరుకున్నాయి. పార్టీ శ్రేణులతో ఆయన వాగులో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దుబ్బాక బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు వెంకట్‌స్వామి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ విస్తృతంగా వాహనాల తనిఖీ

సిద్దిపేటకమాన్: లోక్‌సభ ఎన్నికల నిబంధనలు అమలులో ఉండటంతో జిల్లా వ్యాప్తంగా శుక్రవారం కేంద్ర బలగాలతో కలిసి పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రజలు రూ.50 వేల కంటే ఎక్కువ డబ్బు వెంట తీసుకెళ్లకూడదని పోలీసు అధికారులు సూచించారు. అత్యవసరంగా డబ్బు తీసుకెళ్లేవారు తగిన ఆధారాలు తమవద్ద ఉంచుకోవాలన్నారు. వాహనాలను తనిఖీ చేసే సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, పోలీసులకు వాహనదారులు సహకరించాలన్నారు.

◆ కాంగ్రెస్‌తోనే అభివృద్ధి

మర్కూక్(గజ్వేల్): కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కాశిరెడ్డిపల్లిలో వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ రాజ్యంలో ప్రతీ గ్రామానికి అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందాయన్నారు.

◆ అసత్య ఆరోపణలు తగదు

సిద్దిపేటకమాన్: తమపై కొందరు బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని సిద్దిపేట 37వ వార్డు కౌన్సిలర్ సాకి బాల్‌లక్ష్మీ అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ తనను విమర్శించే స్థాయి బీఆర్ఎస్ నాయకులకు లేదన్నారు. గతంలో తాను వార్డు కౌన్సిలర్‌గా కాంగ్రెస్ పార్టీ మద్దతుతో గెలిచిన తర్వాత బీఆర్ఎస్ నాయకులు ఇంటికి వచ్చి అడిగితే మార్టీ మారానన్నారు. సిద్దిపేట మున్సిపల్ చైర్‌పర్సన్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టి నెగ్గగలిగే సత్తా తనకు ఉందన్నారు. తాను ఏ పార్టీలో ఉన్నా ఆ పార్టీ బలోపేతానికి నిజాయితీగా పనిచేశానన్నారు. అసత్య ఆరోపణలు చేసిన వారు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు అసత్య ఆరోపణలు చేయడంపై కంటతడి పెట్టారు.

◆ గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తా

గజ్వేల్‌రూరల్: టిప్పర్ ఢీకొనడంతో గ్యాస్ సిలిండర్ల లారీ బోల్తాపడింది. ఈ సంఘటన మండల పరిధిలోని గజ్వేల్-తూగుట మార్గంలోని బయ్యారం చౌరస్తా వద్ద శుక్రవారం జరిగింది. గజ్వేల్ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌లోని చర్లపల్లి ప్రాంతం నుంచి హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ల లోడుతో ఉన్న లారీ దుబ్బాక వెళ్తోంది. ఈ క్రమంలో బయ్యారం చౌరస్తా వద్ద టిప్పర్ ఢీ కొనడంతో బోల్తాపడింది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని సిలిండర్ల నుంచి గ్యాస్ లీక్ కాకుండా చర్యలు తీసుకున్నారు.